

పెద్దతూప్రా క్లస్టర్‌లో ఎన్నికల నియమావళిని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నామినేషన్ల స్వీకరణలో పొరపాట్లకు తావివ్వొద్దు

- కలెక్టర్ నారాయణరెడ్డి
- పెద్దతూప్రా, మదన్‌పల్లి, ముచ్చింతల్ క్లస్టర్లను సందర్శించిన కలెక్టర్

శంషాబాద్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొదని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని పెద్దతూప్రా, మదన్‌పల్లి, ముచ్చింతల్ క్లస్టర్‌ను జనరల్ అబ్జర్వర్ పి. ప్రశాంత్‌జీవన్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన సందర్శించారు. అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27 నుంచి 29 వరకు నామినేషన్లు దాఖలు చేయాలని చేస్తారని, ఆ సమయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని జనరల్ అబ్జర్వర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించి జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలని సూచించారు. విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బంది నామినేషన్ పత్రాలు దాఖలు చేసే అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎలాంటి సందేహాలున్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనరల్ అబ్జర్వర్ ఎంపీడీవో మున్ని, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

షాద్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో పోలీస్, ఎన్నికల యంత్రాంగం విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. గురువారం రాయికల్ టోల్‌ప్లాజా వద్ద ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాలను ఆపి తనిఖీ చేశారు. వాహనాలు, బస్సుల్లో ఉన్న ప్రయాణికుల బ్యాగులను కూడా సోదాలు చేపట్టారు. ఈ విషయంలో ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులు కొంత అసౌకర్యానికి గురికావడంతో పాటు, పోలీస్ యంత్రాంగంపై అసహనం వ్యక్తం చేశారు. దీంతో ఎన్నికల అధికారులు కల్పించుకుని సర్పంచ్ ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, అందరూ సహకరించాలని కోరారు.

విమానంలో మహిళకు అస్వస్థత

శంషాబాద్ రూరల్, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి) : మదీనా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న విమానంలో మహిళా ప్రయాణికురాలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వివరాలు ఇలా...మదీనా నుంచి 6ఈ ఇండిగో 58 విమానం గురువారం ఉదయం 10.30 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. విమానం గాలిలో ఉండగానే పటేల్ బాటీనాజ్ (62) అనే మహిళ ప్రయాణికురాలికి తలనొప్పి, వాంతులు, రావడంతో ఆమె కుటుంబ సభ్యులు ఎయిర్‌లైన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. పైలెట్ ఏటీసీ అధికారులకు మెడికల్ ఎమర్జెన్సీ సిబ్బందికి సమాచారం అందించారు. విమానం ల్యాండ్ కాగానే ఆమెను ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు డాక్టర్లు చెప్పినట్లు తెలిసింది.

తొలివిడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదలు కావడంతో గ్రామాల్లో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. పార్టీ గుర్తులతో సంబంధం లేకుండా ఎన్నికలు జరుగుతున్నప్పటికీ పల్లెల్లో పట్టుకోసం ప్రధాన పార్టీలు కసరత్తు ప్రారంభించాయి. తమ మద్దతుదారులను గెలిపించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ ఎన్నికల్లో పట్టుసాధిస్తే తర్వాత జరిగే పరిషత్ ఎన్నికల్లో సులువుగా విజయం సాధించొచ్చని నేతలు అంచనా వేస్తున్నారు. దీంతో ప్రతీ గ్రామంలోని ఎన్నికలను సవాల్‌గా తీసుకుంటున్నారు.



పల్లెల్లో పట్టెవరిది?

ప్రధాన పార్టీలకు సవాల్‌గా పంచాయతీ ఎన్నికలు

- మద్దతుదారులను గెలిపించుకునేందుకు పోటాపోటీ
- ఇక్కడ పట్టుసాధించి పరిషత్ ఎన్నికల్లో సత్తాచాటేలా వ్యూహం
- పలు చోట్ల ఏకాభిప్రాయానికి అధికార పార్టీ యత్నాలు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

పంచాయతీ ఎన్నికలకు పార్టీ శ్రేణులను ఆయా పార్టీలు సన్నద్ధం చేస్తున్నాయి. ఎన్నికల బరిలో దిగేందుకు సిద్ధమైన ఆశావహులు ఇప్పటికే తమ అనుచరులతో కలిసి గడప గడపకూ తిరుగుతుండడంతో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. పంచాయతీ ఎన్నికల్లో సామాజిక, ఆర్థిక అంశాలు ప్రజలను ఎక్కువగా ప్రభావితం చేసే అవకాశం ఉంది. డబ్బులు, తాయిలాలు ప్రధానాస్త్రాలుగా మారి అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేస్తున్నాయి. దీంతో అంగబలం, అర్థబలం ఉన్న నేతలను ఆయా పార్టీలు బరిలో దింపేయత్నం చేస్తున్నాయి. పల్లెల్లో పట్టుసాధించేందుకు అనేక వ్యూహాలు రచిస్తున్నాయి. ఏ గ్రామంలో ఎవరిని ఎన్నికల బరిలోకి దించాలనే విషయమై కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఎవరికి వారు వ్యూహరచన చేస్తున్నారు. గ్రామాల్లో పట్టున్న నాయకులు ఎవరు..?, వారిలో ఎవరికి విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయి అనేది తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీలను పక్కనబెట్టి ప్రజల్లో మంచి పట్టున్న నాయకుల గురించి వాకబు చేస్తున్నారు. గతంలో గ్రామానికి చేసిన సేవలు, నిర్వహించిన బాధ్యతల గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల్లో ఎవరికి మద్దతిస్తే

మిగతా 8వ పేజీలో...

బీఆర్ఎస్, బీజేపీలకు ప్రతిష్టాత్మకం

ఇదిలా ఉంటే పంచాయతీ ఎన్నికలను బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఈ ఎన్నికల్లో తమ సత్తా చాటుకునేందుకు బలమైన తమ మద్దతుదారులను ఎన్నికల బరిలోకి దించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. గ్రామాల్లో కీలకమైన సర్పంచులను తమ వారిని గెలిపించుకుంటేనే వచ్చే ఏ ఎన్నికలైనా తమ ఆధిపత్యమే కొనసాగుతుందని భావిస్తున్నాయి. వీలైతే ఎక్కువగా ఏకగ్రీవాలు చేసేందుకు అధికార పార్టీ ప్రయత్నిస్తోంది. గ్రామాల్లో సర్పంచ్, వార్డు పదవులకు ఎక్కువగా పోటీ ఉండడంతో ఓట్లు చీలిపోకుండా ఏకగ్రీవంగా చేయాలని భావిస్తోంది. అయితే గ్రామాల్లో పోటీ తీవ్రంగా ఉండడంతో ఎంత వరకు ఈ విషయంలో అధికార పార్టీ విజయం సాధిస్తుందో వేచి చూడాలి.

ఎయిర్‌పోర్టులో మోగిన ఆర్‌డీఈ అలారం

- అప్రమత్తమైన అధికారులు

శంషాబాద్ రూరల్, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని డిపార్చర్ గేటు 05 వద్ద ఆర్‌డీఈ అలారం మోగింది. దీంతో అప్రమత్తమైన సీఐఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ బలగాలు, ప్రయాణికులను గుర్తించేందుకు సీసీ కెమెరాలను పరిశీలించారు. అయితే ఇస్తార్ కొమిటి (69) శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఎయిర్ ఇండియా ఏఐ 2876 విమానంలో సాయంత్రం 4.56 గంటలకు బాంబే వెళ్తుంది. అయితే ఆమె డిపార్చర్ హాల్‌లో ఉన్నట్లు గుర్తించిన బలగాలు, అక్కడి వెళ్లి ఆమెను పరిశీలించగా అనారోగ్య సమస్యల వల్ల ఆమె చికిత్స పొందుతున్నట్లు గుర్తించడం వల్ల అలారం మోగినట్లు గుర్తించారు. అనంతరం అధికారులు ఆమెను విమానంలో ప్రయాణించడానికి అనుమతిచ్చారు. రేడియేషన్ లెవల్ 1.37 ఉండడంతో ఆమెను విమానంలో అనుమతిచ్చిచారు. ఎయిర్‌లైన్స్ అనుమతితో బాంబే వెళ్లారు.



ఆమనగల్లు ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

- అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

ఆమనగల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ఆదేశించారు. ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని ఆయన సూచించారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం జిల్లా పౌరసరాల శాఖ అధికారి వనజాత, కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డిలతో కలిసి అదనపు కలెక్టర్ సందర్శించారు. కొనుగోలుకు తీసుకువచ్చిన ధాన్యాన్ని, రికార్డులను పరిశీలించారు. చలికాలం నేపథ్యంలో తేమ శాతం రావడం లేదని, దీంతో రోజుల తరబడి కేంద్రం వద్ద తూకాల కోసం వేచి చూడాల్సి వస్తుందని అదనపు కలెక్టర్‌ని కోరారు. తేమ శాతం పెంచాలని, తరుగు తీయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విక్రయించిన ధాన్యానికి జాప్యం లేకుండా రైతులకు డబ్బు అందేలా చూడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, సీఈవో దేవేందర్, ఏఈవో మీనాక్షి, భూదేవి, లు, రైతులు తదితరులు ఉన్నారు.

రైతుల డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతాం

కడ్తాల్ : గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణానికి భూములు కోల్పోయే రైతుల డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని

మిగతా 8వ పేజీలో...

నాయకులు నిబంధనలు పాటించాలి

- డీసీపీ రాజేష్



మల్లాపూర్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్

కొత్తూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నామినేషన్లు వేయడానికి వచ్చేవారు నిబంధనలు పాటించాలని శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్ సూచించారు. మండల పరిధిలోని మల్లాపూర్ గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని డీసీపీ రాజేష్ పరిశీలించారు. ఆయన వెంట కొత్తూర్ ఇన్‌స్పెక్టర్ జి. నర్సయ్య, ఎస్ఐ సత్యశీలారెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

చేగూర్ నామినేషన్ కేంద్రం వద్ద..

నందిగామ : స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా గురువారం డీసీపీ రాజేష్ నందిగామ మండలంలోని చేగూర్‌లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. నామినేషన్ల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. డీసీపీ వెంట శంషాబాద్ జోన్ ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఉన్నారు.

తొలిరోజే 'పంచాయతీ' సందడి

- జోరుగా నామినేషన్లు దాఖలు
- సర్పంచ్ స్థానాలకే అధికంగా నామినేషన్లు
- సర్పంచ్ స్థానాలకు 145, వార్డులకు 119



కేశంపేట మండలంలో నామినేషన్ వేస్తున్న మహిళా అభ్యర్థి జ్యోతి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): పంచాయతీ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల కావడంతో నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. తొలిరోజే సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్లు వేసేందుకు నేతలు పోటీపడ్డారు. దీంతో ఎక్కడ చూసినా పల్లెల్లో రాజకీయ సందడి కనిపించింది. తొలి విడత జిల్లాలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికలకు అధికారులు ఉదయం నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లాలోని ఏడు మండలాల పరిధిలోని 174 పంచాయతీల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. 174 సర్పంచ్ పదవులతో పాటు 1530 వార్డు పదవులకు నోటిఫికేషన్ విడుదల కాగానే నామినేషన్ల స్వీకరణ చేపట్టారు. తొలిరోజు వార్డు స్థానాల్లో కంటే సర్పంచ్ స్థానాలకు ఎక్కువగా నామినేషన్లు రావడం గమనార్హం. తొలి రోజు జిల్లా వ్యాప్తంగా సర్పంచ్ స్థానాలకు 145 నామినేషన్లు దాఖలు కాగా, వార్డు స్థానాలకు 119 నామినేషన్లు వచ్చాయి. సర్పంచ్ స్థానాలకు ఫరూఖ్‌నగర్ మండలంలో అత్యధికంగా 34 నామినేషన్లు రాగా అతి తక్కువగా కొత్తూరు మండలంలో 11 నామినేషన్లు వచ్చాయి. అలాగే శంషాబాద్ మండలంలో అత్యధికంగా వార్డుస్థానాలకు 31 నామినేషన్లు వచ్చాయి. జిల్లెల చౌదరిగూడెం మండలంలో అతి తక్కువగా 5 వార్డులకు మాత్రమే నామినేషన్లు వచ్చాయి. నామినేషన్ల స్వీకరణ రేపటితో ముగియనుండడంతో నేడు, రేపు భారీగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది. ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించేందుకు జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్, కలెక్టర్ నారాయణరెడ్డి శంషాబాద్ మండలంలో పర్యటించారు.

తొలి రోజు నామినేషన్ల వివరాలు

మండలం	పంచాయతీలు	నామినేషన్లు	వార్డులు	నామినేషన్లు
ఫరూఖ్‌నగర్	47	34	410	19
జిల్లెల చౌదరిగూడెం	24	30	204	5
కేశంపేట	29	24	260	7
కొత్తూరు	12	11	110	22
కొందుర్గు	22	13	186	25
నందిగామ	19	16	170	10
శంషాబాద్	21	17	190	31

విపక్షాల కుట్రలను ఎండగట్టాలి 8

'కాంగ్రెస్' అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పని చేయాలి 8

29న దివ్యాంగుల క్రీడా పోటీలు

- దివ్యాంగుల సంక్షేమాధికారి శ్రీలత



ఇబ్రహీంపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 29న దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఎల్.శ్రీలత తెలిపారు. సరూర్‌నగర్ స్టేడియంలో శనివారం ఉదయం 9గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయన్నారు. శారీరక, అంధ, బధిర, మానసిక దివ్యాంగులైన మహిళ, పురుషులు ఈ పోటీల్లో పాల్గొనాలని ఆమె సూచించారు. జూనియర్స్ విభాగంలో 10-18 సంవత్సరాల వయసువారు, సీనియర్స్ విభాగంలో 18-54 సంవత్సరాల వయస్సువారు పాల్గొనాలన్నారు. అంధుల విభాగంలో షాట్‌పుట్, రన్నింగ్, చెస్ ఉంటాయని, బధిరుల విభాగంలో షాట్‌పుట్, జావెలిన్ త్రో, రన్నింగ్, శారీరక దివ్యాంగుల విభాగంలో షాట్‌పుట్, జావెలిన్ త్రో, క్యారమ్స్, మానసిక దివ్యాంగుల విభాంగంలో షాట్‌పుట్ రన్నింగ్ పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీలో పాల్గొనాలకునేవారు పుట్టిన తేదీకి సంబంధించి స్టడీ, లేదా ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను సమర్పించాలని ఆమె తెలిపారు. ఇతర వివరాల కోసం 7093180748లో సంప్రదించాలని ఆమె తెలిపారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

ఎన్నికల పరిశీలకుడు ప్రశాంత్ జీవన్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిని ఉపేక్షించబోమని కఠిన చర్యలు తీసుకుంటామని పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకులు ప్రశాంత్ జీవన్ పాటిల్ ఎన్నికల సిబ్బందిని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నోడల్ అధికారులు తమకు అప్పగించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా సజావుగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ప్రశాంత్ జీవన్ పాటిల్ గురువారం కలెక్టరేట్‌లో వ్యయ పరిశీలకులు ఆర్య, కలెక్టర్ సి.నారాయణ రెడ్డిలతో కలిసి నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించి ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, చేపట్టబోయే చర్యలు, పోలింగ్ వరకు తీసుకోవాల్సిన చర్యలపై కూలంకషంగా సమీక్షించారు. నోడల్ అధికారులు ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తిచేయాలన్నారు. మొదటి విడత పోలింగ్ డిసెంబర్ 11న, రెండవ విడత పోలింగ్ డిసెంబరు 14న, మూడో విడత పోలింగ్ డిసెంబర్ 17న జరగనున్న దృష్ట్యా ఆర్వోలు, ఏఆర్‌ఓలు, పీఓ, ఏపీఓలు, జోనల్ అధికారులు, సూక్ష్మ పరిశీలకులకు మరోసారి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలని, నోడల్ అధికారులు అవసరమైతే వారి కార్యాలయ, లేదా ఇతర శాఖలకు చెందిన సిబ్బందిని సహాయకులుగా నియమించుకోవాలని సూచించారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, మెటీరియల్ మేనేజ్మెంట్‌తో పాటు ఎన్నికల సిబ్బంది, జోనల్ అధికారుల నియామకం, ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించి ప్రతి రోజు తమకు నివేదికలు పంపించాలని ఆదేశించారు. అభ్యర్థుల ఖర్చులకు సంబంధించిన వివరాలను, నివేదికలను నోడల్ అధికారి చూడాలన్నారు. రాజకీయ ప్రకటనలకు నిఘా ఉంచాలన్నారు. ఎక్కడా అలసత్వానికి తావివ్వరాదని, ఎన్నికల విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే ఎన్నికల నియమాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, ఆర్డీవోలు, డీపీవో సురేష్ మోహన్, నోడల్ అధికారులు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయింపునివ్వాలి


పరిగిలో సమావేశమైన భాషా పండితులు

పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

పరిగి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం పరిగిలో నిర్వహించిన భాషా పండితల సమావేశానికి పరిషత్ ప్రధాన కార్యదర్శి ఏజాజ్అహ్మద్‌తో కలిసి హాజరై మాట్లాడారు. 1/2005 చట్టాన్ని రద్దు చేయాలని, భాషా పండితులుగా చేసిన కాలానికి నోషనల్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. 190 జీవో సవరించి భాషా ఉపాధ్యాయులకు డిప్యూటేషన్ అవకాశం కల్పించాలని కోరారు. ఇతర సబ్జెక్టుల మాదిరిగా ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో భాషా ఉపాధ్యాయులను నియమించాలన్నారు. పండితుల డిమాండ్ల సాధనకు సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు కృష్ణయ్య, మహేందర్, పారూఖ్‌పటేల్, వెంకటయ్య, నయీమొద్దీన్, రవికుమార్, జి.మంజుల, బాలమణి, అమృత తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా పండిత పరిషత్ మండలాల కార్యవర్గాల ఎన్నిక

పండిత పరిషత్ కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పరిగి మండల కార్యవర్గ అధ్యక్షుడిగా ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శిగా వీరానందంచారి, కోశాధికారి అనిత, మహిళా ప్రతినిధులుగా అనంతలక్ష్మి, బీబీ ఎన్నికయ్యారు. పూడూరు మండల అధ్యక్షుడిగా ఉమర్‌ఖాన్, ప్రధాన కార్యదర్శిగా టి.మౌనిక, కోశాధికారిగా షఫీ ఎన్నికయ్యారు. అలాగే కులకచర్ల మండల అధ్యక్షుడిగా పల్లె శీనయ్య, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ ప్రసాద్, కోశాధికారి జి.యాదగిరి, మహిళా ప్రతినిధిగా గంగా, దోమ మండల అధ్యక్షుడిగా బుచ్చిబాబు, ప్రధాన కార్యదర్శిగా ఎం.నరసింహ, కోశాధికారిగా వెంకటాచారి, మహిళా ప్రతినిధిగా శాంతి, చౌడపూర్ మండల అధ్యక్షుడిగా నరేష్, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్, కోశాధికారిగా బసయ్య, మహిళా ప్రతినిధిగా బి.రమాదేవి ఎన్నికయ్యారు.

రిజర్వేషన్లలో బీసీలకు అన్యాయం

పరిగి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని జేఏసీ జిల్లా కన్వీనర్ ఎం.నాగేశ్వర్ గురువారం ప్రకటనలో ఆరోపించారు. ప్రభుత్వం జిల్లాలో 594 సర్పంచులకు 107 స్థానాలు కేటాయించి 18 శాతంతో సరిపెట్టిందన్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి మరింత తక్కువ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు.


అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

పక్కాగా నామినేషన్ల ప్రక్రియ

బషీరాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. గురువారం మండలంలోని పలు నామినేషన్ల కేంద్రాలను తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కాశీంపూర్, గొట్టిగకలాన్ తదితర నామినేషన్ కేంద్రాల్లో అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.


కూరగాయల దుకాణాన్ని ప్రారంభిస్తున్న గోపాల్‌నాయక్

సేంద్రియ కూరగాయలతో ఆరోగ్యం

బొంరాస్‌పేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వాసన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సేంద్రియ కూరగాయల దుకాణాన్ని అరక ఎఫ్‌పీసీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ పద్ధతిలో పండించే కూరగాయలు, సిరి ధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి గోపాల్, గ్రామస్తులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, మాజీ స్పీకర్ మధుసూదన చారి

మోకిల తండాలో రెస్టారెంట్ ప్రారంభం

శంకర్‌పల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోకిల తండాలో లివి కేఫ్ అండ్ రెస్టారెంట్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రారంభించారు. మాజీ స్పీకర్ మధుసూదనాచారి కుమారుడు ప్రశాంత్‌కు చెందిన లివి కేఫ్ అండ్ రెస్టారెంట్‌ను గురువారం మాజీ మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌రావు, మాజీ స్పీకర్ మధుసూదనాచారితో కలిసి ప్రారంభించి ప్రశాంత్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శశిధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రెసిడెంట్ గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజునాయక్, మాజీ వైస్ చైర్మన్ శ్రీధర్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు లింగం ముదిరాజ్, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, నాయకులు రవినాయక్, ఫరీద్, భూపాల్, ఉపేందర్‌రెడ్డి ఉన్నారు.

డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్‌కు సన్మానం


దారాసింగ్‌ను సన్మానిస్తున్న శివరాంనాయక్

చౌడాపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్‌ను ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శివరాంనాయక్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ధారాసింగ్‌ను పరిగి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ధారాసింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవినాయక్, చౌడాపూర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, పరిగి అధ్యక్షుడు తావుర్యానాయక్, మాజీ ఎంపీపీ సత్యహరిచంద్ర, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రామ్‌లాల్‌నాయక్, నాయకులు విఠల్‌నాయక్, రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

ఎన్నికలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు


వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ గంగాధర్

కడ్తాల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు సజావుగా శాంతియుతంగా జరిగేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని 210 పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కడ్తాల్ మండల కేంద్రం సమీపంలోని ముచ్చర్ల గేటు వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును గురువారం ప్రారంభించారు. ఎస్సైలు వరప్రసాద్, చంద్రశేఖర్, సిబ్బందితో కలిసి ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామాల్లో అదనపు పోలీసు బలగాలను మొహరించనున్నట్లు తెలిపారు. అన్నీ పోలింగ్ బూత్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని, గ్రామాల్లో గతంలో అల్లర్లకు కారణమైన వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో రూ.50వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తే సరైన ఆధారాలు చూపాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

విద్యుత్ వైరు తగిలి వరిగడ్డి దగ్ధం



కొత్తూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొడిచర్ల శివారులో ఎస్‌బీపల్లి రోడ్డులో విద్యుత్ వైర్లు తగలి గడ్డి దగ్ధం కాగా, లారీ పాక్షికంగా మంటల్లో చిక్కుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మహేశ్వరం మండలం నాగారం సమీపంలోని ఏనుగుచెరువుతండాకు చెందిన రైతు శంకర్ కొత్తూర్ మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో వరి గడ్డిని కొనుగోలు చేశాడు. గురువారం గడ్డిని లారీలో తరలిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి గడ్డిలో మంటలు చెలరేగాయాయి. లారీ మంటల్లో చిక్కుకోగా గమనించిన రైతు శంకర్, డ్రైవర్ సందీప్ లారీలో గడ్డిని కిందకు నెట్టి వేశారు. అటుగా వెళ్తున్న పోలీసులు గమనించి షాద్‌నగర్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. గంట వరకు అగ్నిమాపక యంత్రం రాకపోవడంతో బాధితులు విస్మయం వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదంలో దాదాపు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు వాపోయారు.


పిల్లల్లో ఇంగ్లిష్‌పై ఆసక్తిని పెంపొందించాలి


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

పరిగి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఇంగ్లిష్‌పై అభిరుచిని పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని పరిగి ఎంఈవో గోపాల్ అన్నారు. పరిగిలోని జెడ్పీహెచ్ఎస్ నం.1 పాఠశాలలో గురువారం ఇంగ్లిష్ లాంగ్వేజ్, టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంగ్లిష్ ఒలంపియాడ్ ఎడ్యుకేషన్ టాక్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు మురళీధర్‌యాదవ్, కె.వెంకటయ్య, డి.హన్మంత్, భారతి, శిల్పశ్రీ, స్రవంతి, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ముగ్గురు పిల్లల నిబంధన' ఎత్తివేత

కులకచర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు గతంలో ఉన్న ముగ్గురు పిల్లల నిబంధనను ఎత్తివేస్తూ ప్రభుత్వం గెజిట్ జారీ చేసిందని మండల పంచాయతీ ఎన్నికల అధికారి, ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ముగ్గురు పిల్లలు ఉంటే ఎన్నికల్లో పోటీకి అనర్హులనే నిబంధన ఉండేదన్నారు. మండలంలో డిసెంబరు 3 నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. 33 గ్రామ పంచాయతీలకు సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు ఎనిమిది కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కేంద్రాల వారీగా పుట్టపహడ్, అనంతసాగర్, సాల్విడ్, ఘనపూర్, దీప్లనాయక్ తండా, చెల్లాపూర్, హన్యానాయక్ తండా, బండవెల్కిచర్ల, రాంనగర్, ఎర్రగోవింద్ తండా, బొంరెడ్డిపల్లి, ముజాహిద్‌పూర్, దాస్యనాయక్ తండా, రాంరెడ్డిపల్లి, అల్లాపూర్, తిరుమలాపూర్, లాల్‌సింగ్ తండా, బండమీది తండా, ఇప్పాయిపల్లి, కులకచర్ల, చాపలగూడెం, ఎత్తుకాల్వ తండా, చెరువు ముందలి తండా (ఏ), కుసుమసముద్రం, చెరువు ముందలి తండా (కే), గోరిగడ్డ తండా, రాంపూర్, కామునిపల్లి, పీరంపల్లి, బోత్యనాయక్ తండా, పటేల్ చెరువు తండాల్లో నామినేషన్లు స్వీకరించనున్నట్లు వివరించారు.


విద్యార్థులతో ఎంఈవో లక్ష్మణ్ నాయక్, సంస్థ ప్రతినిధులు

పాఠశాలల బలోపేతానికి సహకరించాలి

షాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకు రావాలని ఎంఈవో లక్ష్మణ్ నాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలో వెంకమ్మగూడ స్కూల్‌లో స్ట్రీట్‌కాస్ వీజేఐటీ తరఫున విద్యార్థులకు వ్యాకరణ, సాధారణ జ్ఞాన, నోట్‌బుక్‌లు, పాఠశాలకు సీపీయూ, ఇతర డిజిటల్ ఉపకరణాలు అందజేశారు. ఎంఈవో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అందరి సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో విద్యాజ్యోతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ వెంకటాచలం, తదితరులు పాల్గొన్నారు. కాగా, తాళ్లపల్లి స్కూల్‌లో స్ట్రీట్‌కాజ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు స్వీయ రక్షణపై ర్యాలీ నిర్వహించి శిక్షణ ఇచ్చారు.



నామినేషన్‌కు డబ్బుల్లేవ్..

మంతన్‌పల్లిలో విచిత్ర ఘటన.. ఏకగ్రీవం కానున్న సర్పంచ్, వార్డు పదవులు

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన భీమప్ప కుటుంబ సభ్యులు

బషీరాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంతన్‌గౌడ్ పంచాయతీకి సంబంధించి సర్పంచ్, రెండు వార్డు సభ్యుల పదవులు ఎస్టీ జనరల్‌కు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ గ్రామంలో ఒకే ఒక్క ఎస్టీ అయిన భీమప్ప కుటుంబం ఉండటంతో ఆ కుటుంబంలోనే ఒకరికి సర్పంచ్, రెండు వార్డు సభ్యుల పదవులు ఏకగ్రీవం కానున్నాయి. ఈ క్రమంలో గురువారం గ్రామంలో విచిత్రమైన ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన యువకులు కొందరు భీమప్పతో సమావేశమయ్యారు.



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఎరుకల భీమప్ప కుటుంబ సభ్యులు

నామినేషన్ వేయడానికి సర్పంచ్ పదవికి రూ.1,000, వార్డు సభ్యుల పదవులకు రూ.500 చొప్పున డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అయితే నామినేషన్ రుసుం చెల్లింపునకు బీరప్పను డబ్బులు అడుగగా, నా దగ్గర లేవని చెప్పడంతో యువకులంతా ఆశ్చర్యపోయారు. ఎవ్వరైనా సరే మీరు చూసుకోండి.. పంచాయతీలో డబ్బులు వచ్చాక మీరే తీసుకోండి అని బీరప్ప చెప్పడం విశేషం. అయితే బీరప్ప కుటుంబ సభ్యులు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామానికి తన కోటా కింద రూ.10 లక్షలు ఇస్తానని ప్రకటించారు.





గోడలపై పెయింటింగ్ వేస్తున్న కళాకారుడు రూపం వెంకట్ రెడ్డి

ఎన్నికలకు పని లేదు

- డిజిటల్ ఫ్లెక్సీల రాకతో కళాకారుల ఇక్కట్లు
- కనుమరుగవుతున్న వాల్ రైటింగ్స్, క్లాత్ బ్యానర్స్

ఆమనగల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు వచ్చాయంటే గతంలో చేతినిండా పని దొరికేది. మరో నలుగురు జూనియర్ ఆర్టిస్టులకు పని ఉండేది. సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థులు వారి ఎన్నికల గుర్తులను క్లాత్ బ్యానర్లుగా, వాల్ రైటింగ్స్‌గా వేయించేవారు. నేడు మార్కెట్‌లో డిజిటల్ ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలు, స్క్రీన్ ప్రింటింగ్‌లు రావడంతో పని లేకుండా పోతోందని ఆమనగల్లుకు చెందిన కళాకారుడు వెంకట్ రెడ్డి వాపోతున్నాడు. గతంలో ఎన్నికలు వచ్చాయంటే ఒక్కో అభ్యర్థి నుంచి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు స్థాయిని బట్టి పని దొరికేదని, ప్రస్తుతం కళాకారులకు ఆదరణ కరువైందని వాపోతున్నాడు. రూపం ఆర్టిస్ట్ పేరుతో 35 ఏళ్లుగా ఆమనగల్లులో కొనసాగుతున్నాని, పని లేక కళాకారులు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారని వాపోతున్నాడు.

ముచ్చటగా మూడుసార్లు

సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం

ఆదర్శంగా నిలుస్తున్న మైసిగండి గ్రామం

ఈసారి కూడా అదే దారిలో గ్రామస్తులు


ఆమనగల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏకగ్రీవాల్లో కడ్తాల మండలం మైసిగండి గ్రామ పంచాయతీ రికార్డులు సృష్టిస్తోంది. వరుసగా మూడు సార్లు సర్పంచ్, మూడు సార్లు ఎంపీటీసీ సభ్యుడిని, మరో రెండు సార్లు సింగిల్ విండో డైరెక్టర్‌ను ఆ గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసారి జనరల్ మహిళకు కేటాయించిన సర్పంచ్ స్థానాన్ని కూడా ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి స్థానికులు చర్చలు జరుపుతున్నారు. గిరిజనులతోపాటు బీసీలు నివాసం ఉన్న ఇక్కడి ప్రజలు రాజకీయాలను ఎన్నికల వరకే పరిమితం చేస్తూ ఆ తర్వాత అభివృద్ధి విషయంలో విబేధాలకు తావులేకుండా ఐక్యతను చాటుకుంటున్నారు.

మైసిగండి పంచాయతీ వివరాలు

కుటుంబాలు	612
జనాభా	2850
ఓటర్లు	1800
స్త్రీలు	925
పురుషులు	875
గిరిజనులు	1612
బీసీలు	188

1981లో ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు 45 కిలోమీటర్ల దూరంలో మైసిగండి గ్రామం కడ్తాల పంచాయతీకి అనుబంధంగా ఉండేది. 1981లో గాన్గుమర్ల తండా, పెద్దవేములోని బావితండా, చిన్నవేములోని బావి తండా, పుల్లేరు బోడుతండా, పోచమ్మగడ్డ తండా, గడ్డమీది తండా, ఎలుగు రాళ్ల తండా, కాన్గుబావి తండాలను కలిపి మైసిగండిని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. 2019లో పెద్ద వేములోని బావితండా, గడ్డమీది తండా, గాన్గుమర్ల తండాలు కొత్త పంచాయతీలుగా ఏర్పడడంతో మైసిగండి ఒక్కటే పంచాయతీగా మిగిలింది. 1981 నుంచి 2019 వరకు మైసిగండి పంచాయతీకి ఏడు సార్లు ఎన్నికలు జరిగాయి. 95 శాతం గిరిజనులు ఉన్న ఇక్కడ మూడుసార్లు సర్పంచ్‌తోపాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం విశేషం. 1981లో రామావత్ దేశ్యానాయక్, 1988లో రామావత్ పంతానాయక్, 1995లో కేతావత్ దేవ్‌సింగ్, 2001లో నేనావత్ బీక్యానాయక్, 2006లో కేతావత్ దేవ్‌సింగ్, 2013లో మాదారం శేఖర్‌గౌడ్, 2019లో రామావత్ తులసీరామ్ సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు.



రామావత్ దేశ్యానాయక్, గ్రామ తొలి సర్పంచ్(1981)



కేతావత్ దేవ్‌సింగ్, సర్పంచ్ (1995, 2006)



ఈసారి కూడా అదే దారిలో..

మైసిగండి సర్పంచ్‌ను ఈసారి కూడా ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. రిజర్వేషన్లలో భాగంగా పంచాయతీ సర్పంచ్ పదవిని జనరల్ మహిళకు కేటాయించారు. పదవిపై అర డజన్ మంది ఆశలు పెట్టుకున్నారు. స్థానికులతో సమావేశం జరిపి సర్పంచ్ పదవి ఏకగ్రీవం చేసుకుంటే బాగుంటుందని, గ్రామం అభివృద్ధి చెందుతుందని, ప్రభుత్వం ప్రకటించిన రూ.30 లక్షలు ప్రోత్సాహం పొందవచ్చునని స్థానికులకు వారికి నచ్చజెబుతున్నారు.

ఎంపీటీసీ కూడా ఏకగ్రీవమే..

మైసిగండి ఎంపీటీసీ ఎన్నికల్లోనూ ఆదర్శంగానే నిలిచింది. 1995లో తొలిసారిగా ఎంపీటీసీ, ఆమనగల్లు జెడ్పీటీసీగా తండాకు చెందిన పంతూనాయక్ గెలుపొందారు. రెండు పదవులకు గెలుపొందిన ఆయన మైసిగండి ఎంపీటీసీకి రాజీనామా చేయడంతో 1996లో ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో నేనావత్ బీక్యానాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2006 మైసిగండి ఎంపీటీసీ స్థానాన్ని రిజర్వేషన్లలో భాగంగా బీసీలకు కేటాయించారు. దీంతో బీసీ వర్గానికి చెందిన అయిళ్ల శ్రీనివాస్ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2014లో మళ్లీ జనరల్ కేటాయించడంతో మళ్లీ శ్రీనివాస్ గౌడే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిదంగా రెండు సార్లు సింగిల్ విండో డైరెక్టర్‌ను కూడా ఇక్కడి రైతులు ఏకగ్రీవంగా ఎన్నుకొని ఆదర్శంగా నిలిచారు. 2019లో ఎంపీటీసీగా గెలుపొందిన దేపావత్ కమ్లీమోత్యానాయక్ నూతనంగా ఏర్పడ్డ కడ్తాల మండలానికి ఎంపీపీగా ఎన్నికయ్యారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌లు వీరే..

1981లో తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో రామావత్ దేశ్యానాయక్ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై అప్పట్లో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. 1995, 2006లో రిజర్వేషన్లలో భాగంగా సర్పంచ్ పదవిని ఎస్టీలకు కేటాయించగా దివంగత కేతావత్ దేవ్‌సింగ్ ఎన్నికయ్యారు. 2006లో సర్పంచ్, వార్డు సభ్యుల పదవులు ఏకగ్రీవం కావడంతో ప్రభుత్వం రూ.5 లక్షలు ప్రోత్సాహకం లభించింది.

ఏకతాటిపైకి పంచాయతీలు!

- ఏకగ్రీవ బాటలో దుగ్గాపూర్, ఆత్కూర్ గ్రామాలు



పెద్దేముల్ మండలం దుగ్గాపూర్ గ్రామం

పంచాయతీలు, ఓటర్లు

గ్రామాలు	38
వార్డులు	308
ఓటర్లు	40,828
మహిళలు	21,024
పురుషులు	19,804

పెద్దేముల్, నవంబర్ 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎక్కడ చూసినా ఏకగ్రీవం మాటే వినిపిస్తోంది. ఇనానమస్ అయితే ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా ప్రోత్సాహకాలు వస్తాయన్న ఆశతో ప్రజలంతా ఏకమవుతున్నారు. మండలంలోని దుగ్గాపూర్, ఆత్కూర్ గ్రామాల్లో సర్పంచ్ పదవిని ఇనానమస్ చేసే ఆలోచనలో ఆయా గ్రామాల ప్రజలు ఒక్కతాటిపైకి వస్తున్నారు. దీనిపై ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అయితే అభ్యర్థిని ఎంచుకునే విషయంలో సందిగ్ధత నెలకొని ఉంది. ఇప్పటికే ఒకసారి సమావేశం కాగా మరోమారు సమావేశమై అభ్యర్థిని ఎంపిక చేయనున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. అభ్యర్థి ఎంపికపై శుక్రవారం సమావేశమవుతున్నట్లు తెలిపారు. దుగ్గాపూర్ గ్రామంలో 515 మంది ఓటర్లు, ఆత్కూర్ గ్రామ పంచాయతీలో 684 మంది ఓటర్లు ఉన్నారు.

టీఈ పోల్ యాప్‌తో ఓటర్ స్లిప్పులు

వికారాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): టీఈ పోల్ మొబైల్ యాప్ ద్వారా కావాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సమాచారాన్ని పొందవచ్చని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మొబైల్ యాప్ ద్వారా ఓటరు స్లిప్ పొందవచ్చని పేర్కొన్నారు. పోలింగ్ స్టేషన్ వివరాలను కూడా యాప్ ద్వారా తెలుసుకోవచ్చని, అదేవిధంగా ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు ఉంటే కూడా యాప్ ద్వారా తెలియచేయవచ్చని సూచించారు.

బషీరాబాద్‌షాలు

సర్పంచ్ నుంచి శాసన సభ వరకు

ఇద్దరన్నదమ్ముల రాజకీయ ప్రస్థానం

మంత్రిగా ఒకరు, ఎమ్మెల్యేగా మరొకరు

తాండూరు/బషీరాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆ కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ముల తొలి అడుగులు సర్పంచ్ పదవి నుంచే మొదలయ్యాయి. వీరిలో ఒకరు మంత్రిగా, మరొకరు ఎమ్మెల్యేగా పదవులు అనుభవించారు. వారే బషీరాబాద్ మండల కేంద్రానికి చెందిన మాజీ మంత్రి స్వర్గీయ ఎం.చంద్రశేఖర్, ఎం.నారాయణరావు. మాజీ మంత్రి స్వర్గీయ చంద్రశేఖర్ రాజకీయ జీవితం బషీరాబాద్ సర్పంచ్ పదవి నుంచే మొదలైంది. 1961లో సర్పంచ్‌గా ఏకగ్రీవమయ్యారు. 1970 వరకు సర్పంచ్‌గా కొనసాగారు. అప్పటినుంచి అంచలంచెలుగా ఎదిగి 1992లో మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మంత్రిగా కొనసాగుతున్న సమయంలోనే గుండెపోటుతో మృతి చెందారు. ఆ తర్వాత అదే కుటుంబం నుంచి చంద్రశేఖర్ సోదరుడు నారాయణరావు రాజకీయాల్లో అరంగేట్రం చేశారు. ఈయన సైతం 1988లో బషీరాబాద్ సర్పంచ్‌గా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1995 వరకు సర్పంచ్‌గా కొనసాగారు. ఆ తర్వాత 2004 తాండూరు శాసన సభ్యుడిగా గెలుపొందారు.



చంద్రశేఖర్(ఫైల్)



నారాయణరావు

మీ సేవకో దండం!

- ఎన్నికల వేళ మొరాయించిన పోర్టల్
- కుల ధ్రువీకరణ పత్రాల కోసం అభ్యర్థులకు తప్పని పాట్లు

కేశంపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మీసేవ పోర్టల్ మొరాయించడంతో ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలై, నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే రిజర్వుడ్ అభ్యర్థులు (ఎస్సీ, ఎస్టీ, బీసీ) నామినేషన్ పత్రాలతో కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. అయితే కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేయడానికి గురువారం ఆయా ప్రాంతాలోట్లని మీ సేవ కేంద్రాలకు వెళ్తే.. సర్వర్ మొరాయిస్తుందని నిర్వాహకులు తెలుపడంతో ఆందోళనకు గురయ్యారు. గంటల తరబడి వేచి ఉన్నా దరఖాస్తు చేయలేకపోయారు. ఒక దరఖాస్తుకు గంటల సమయం తీసుకుంటుండంతో ఎప్పుడు సర్టిఫికెట్ తీసుకుని, ఎప్పుడు నామినేషన్ వేయలని అభ్యర్థులు ఆందోళన చెందారు. అధికారులు స్పందించి మీసేవ పోర్టల్‌లో సర్వర్ మొరాయించకుండ చర్యలు తీసుకోవాలని కోరారు.



మీసేవ పోర్టల్‌లో నిలిచిపోయిన సర్వర్



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యమకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి

ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాలి

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులకు ప్రాధాన్యమివ్వాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులు లేని తెలంగాణ రాష్ట్రాన్ని ఊహించుకోలేమని పేర్కొన్నారు. అన్నీ వదులుకొని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన వారు ఎన్నికల్లో పోటీ చేసి, విజయం సాధించేలా అన్ని రాజకీయ పార్టీలు ప్రోత్సహించాలని కోరారు. ఈ సమావేశంలో సంక్షేమ సంఘం నాయకులు దొడ్డి రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, మేకల వెంకటేష్, రవికుమార్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, రాందాస్ పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాల వద్ద

పోలీసు బందోబస్తు

కొడంగల్ రూరల్, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. కొడంగల్ మండలంలో 25 గ్రామ పంచాయతీలకు సంబంధించి నామినేషన్‌లు వేసేందుకు ఏడు క్లస్టర్లు ఏర్పాటు చేశారు. రావులపల్లిలో ఏర్పాటు చేసిన కేంద్రంలో రావులపల్లి, ఇందనూర్, కస్తూర్‌పల్లి జీపీలకు సంబంధించి సర్పంచ్, వార్డు సభ్యుల పదవుల నామినేషన్లకు అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. అలాగే అంగడిరైచూర్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో అంగడిరైచూర్, లక్ష్మీంపల్లి, సంగాయిపల్లి, టేకుల్‌కోడ్ గ్రామ పంచాయతీలకు సంబంధించిన అభ్యర్థులు నామినేషన్లు వేయనున్నారు. రుద్రారం కేంద్రంలో రుద్రారం, సాటీమీదిపల్లి, భవనమ్మతండా, బోయపల్లి తండా, హస్నాబాద్‌లో హస్నాబాద్. పెద్దనందిగామ, పర్సాపూర్‌లో పర్సాపూర్, హుసేన్‌పూర్, పల్గురాళ్ల తండా, చిట్లపల్లి గ్రామంలో చిట్లపల్లి, ఖాజాహ్మద్‌పల్లి, నాగారం, అన్నారం, కొడంగల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద అప్పాయిపల్లి, ఉడీమేశ్వరం, పోచమ్మతండా, ప్యాలమద్ది, చిన్ననందిగామ జీపీలకు సంబంధించిన అభర్థులు సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు నామినేషన్లు వేయనున్న నేపథ్యంలో అధికారులు ఆయా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



కొడంగల్ ఎంపీడీవో కార్యాలయం వద్ద బందోబస్తులో పోలీసులు

తొలిరోజు జోరుగా నామినేషన్లు



షాద్‌నగర్ రూరల్ : మొగిలిగిద్దలోని నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో సరిత

షాద్‌నగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ పదవుల కోసం ఎన్నికల కోలాహలం మొదలైంది. ఎప్పటి నుంచో ఎన్నికల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు నామినేషన్ల దాఖలు కోసం తొలిరోజే బారులుతీరారు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నియోజకవర్గ పరిధిలో ఎక్కడా ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు. కానీ మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత షాద్‌నగర్ అసెంబ్లీ పరిధిలోని ఆరు మండలాల్లో సాయంత్రం 5గంటల వరకు సర్పంచ్ పదవుల కోసం ఏకంగా 107 మంది అభ్యర్థులు, వార్డు మెంబర్లుగాను 85 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయడం గమనార్హం. గురువారం మంచి రోజు కావడం, నామినేషన్ల దాఖలుకు పెద్దగా గడువు లేకపోవడం వల్ల తొలిరోజునే పెద్ద సంఖ్యలో నామినేషన్లను దాఖలు చేశారు.

మండలాల వారీగా వివరాలు..

ఫరూఖ్‌నగర్ మండలంలో 47 గ్రామపంచాయతీలు ఉండగా సర్పంచ్ పదవులకు గాను 34 మంది, వార్డు మెంబర్ల కోసం 19 మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. కొత్తూరు మండలంలో 12 గ్రామపంచాయతీలకు గాను 11మంది సర్పంచ్‌లకు, 22మంది వార్డుమెంబర్లకు, నందిగామ మండలంలో 19 గ్రామ పంచాయతీలకు గాను సర్పంచ్ పదవి కోసం 16మంది, వార్డుమెంబర్ల కోసం 10 మంది అభ్యర్థులు, కొందుర్గు మండలంలో 22 గ్రామపంచాయతీలకు గాను 15మంది సర్పంచ్ అభ్యర్థులు, 19 మంది వార్డుమెంబర్ల కోసం, చౌదరిగూడ మండలంలో 24 గ్రామపంచాయతీలకు గాను 30మంది సర్పంచ్ అభ్యర్థులు, 5మంది వార్డు

వివరాలు వెల్లడించిన ఎన్నికల అధికారులు

మెంబర్ల కోసం, కేశంపేట మండలంలో 22 గ్రామపంచాయతీలకు.. 13మంది సర్పంచ్ అభ్యర్థులు, 25మంది వార్డుమెంబర్లకు నామినేషన్లను దాఖలు చేశారు.

కేశంపేట : పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసిన నామినేషన్ సెంటర్లను గురువారం కేశంపేట ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి పరిశీలించారు. అల్వాల, కొత్తపేట, వేములనర్వ, పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, సంగెం, కేశంపేట నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అభ్యర్థులకు ఎవైన అనుమానాలు ఉంటే నివృత్తి చేయాలని సూచించారు. కాగా, గురువారం కేశంపేట మండలానికి బ్యాలెట్ బ్యాక్స్‌లు చేరుకున్నాయి. మండల పరిషత్ కార్యాలయంలో వాటిని భద్రపరుస్తున్నారు. మండలంలో 29 గ్రామ పంచాయతీల్లో 260పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

షాద్‌నగర్ రూరల్ : ఫరూఖ్‌నగర్ మండలంలోని నామినేషన్ కేంద్రాలను మండల ప్రత్యేకాధికారి రామారావు గంట్లవెల్లి నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు.



నందిగామ : చాకలిగుట్టతండా సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న మాజీ సర్పంచ్ రాజునాయక్

ఆర్డీవో సరిత మొగిలిగిద్ద కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నామినేషన్ ప్రక్రియను తెలుసుకున్నారు.

నిబంధనలు పాటించాలి

మంచాల : ప్రతీ ఒక్కరు ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎంపీడీవో బాలశంకర్ కోరారు. తహసీల్దార్ ప్రసాద్‌రావుతో కలిసి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఓటర్లందరూ తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. మంచాల మండల పరిదిలో మొత్తం 39,920 ఓటర్లు ఉన్నారని.. 20,477 పురుషులు, 19,443 మంది మహిళా ఓటర్లు ఉన్నారని చెప్పారు. మూడో విడతలో ఎన్నికలు జరుగనున్నట్లు చెప్పారు. 23 గ్రామపంచాయతీలకు సంబంధించి 216 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. మండలాన్ని 9 క్లస్టర్లుగా విభజించామని అభ్యర్థులు తమ నామినేషన్



షాద్‌నగర్ : మల్లాపూర్‌లో నామినేషన్ వేయడానికి వెళుతున్న సర్పంచ్, వార్డుమెంబర్ అభ్యర్థులు

పత్రాలను సమర్పించాలని ఎంపీడీవో తెలిపారు.

తలకొండపల్లి : ఎన్నికల వేళ మండలంలో ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంపీడీవో శ్రీకాంత్ తెలిపారు. డిసెంబరు 14న జరిగే ఎన్నికలకు సంబంధించి 32 గ్రామ పంచాయతీలను 11 క్లస్టర్లుగా విభజించినట్లు చెప్పారు. 272 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో 37,858 మంది ఓటర్లలో.. 18,734 మంది స్త్రీలు, 19,124 మంది పురుషులు ఉన్నట్లు తెలిపారు.

ఎన్నికల వేళ పకడ్బందీ ఏర్పాట్లు

ఆమనగల్లు : పంచాయితీ ఎన్నికలకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆమనగల్లు మండలంలోని 13 గ్రామ పంచాయితీలలో ఎన్నికల ఏర్పాట్ల వివరాలను ఎంపీడీవో, మండల ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి కుసుమ మాధురి వెల్లడించారు. ఆయా పంచాయతీల పరిధిలో 112 వార్డులు ఉన్నాయని, ఆమనగల్లు మండలంలో నాలుగు నామినేషన్ స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. మండల పరిషత్ సమావేశ భవనంలో అధికారులు, సిబ్బందికి ఎన్నికల విధులు, నామినేషన్ల స్వీకరణ, ఎన్నికల నియమావళి అమలు గూర్చి సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ ఫయ్యుమ్‌ఖాద్రీ, సీఐ జానకిరాంరెడ్డి, ఎస్ఐ వెంకటేశ్, ఎంఈవో పాండు, జోనల్ ఆఫీసర్లు శ్రీనివాస్‌గౌడ్, అభిషేక్, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

చేవెళ్ల : గ్రామ పంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీవోలు హిమబిందు, సంధ్య, అపర్ణ, వెంకయ్యలు తెలిపారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో డివిజన్ స్థాయి ఆర్వోలు, ఏఆర్వోలు, ఎన్నికల సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. చేవెళ్ల డివిజన్‌లో రెండో విడత ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. మొత్తం 109 పంచాయతీలు ఉన్నాయని, అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసుకోవాలని ఎంపీడీవోలు సూచించారు. ఎంఈవోలు పురందాస్, మల్లయ్య, అక్బర్, లక్ష్మణ్‌నాయక్, ఎన్నికల సహాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కందుకూరు : గ్రామ పంచాయతీ, వార్డు సభ్యుల ఎన్నికలకు పూర్తి ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో సరిత తెలిపారు. మండలంలోని 35 గ్రామ పంచాయతీలకు మూడో విడత ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబరు 3 నుంచి 6వ తేదీ వరకు నామినేషన్‌లు వేయడానికి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

'మేము ఎలాంటి సమాచారం ఇవ్వం'

శంషాబాద్ రూరల్ : మండల పరిధిలోని పెద్దషాపూర్ క్లస్టర్‌లో మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య కోడలు నామినేషన్ వేయడానికి వచ్చారు. అయితే, వారికి ఫామ్ నింపే క్రమంలో కొన్ని కాలమ్స్ అర్థం కాలేదు. దాంతో వారు అక్కడున్న ఆర్వో, ఏఆర్వోలను అడిగారు. దాంతో వారు మేము ఎలాంటి సమాచారం ఇవ్వం.. మీరు బయట ఎవరినైనా అడిగి తెలుసుకోండి అంటూ కోపంగా సమాధానం చెప్పారు. దాంతో వారు ఆర్వో, ఏఆర్వోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, శంషాబాద్ రూరల్ సీఐ నరేందర్‌రెడ్డి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఏడు కస్టర్లలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శంషాబాద్ మండల పరిధిలో మొదటి రోజు సర్పంచ్ స్థానాలకు 17 నామినేషన్లు దాఖలయ్యాయి. వార్డు సభ్యుల స్థానాలకు 31 నామినేషన్లు దాఖలయ్యాయి.



కేశంపేట : బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరుస్తున్న సిబ్బంది

లింగంధనలో బీసీకీ ఒక్క వార్డే!

కేశంపేట, నవంబరు27(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లలో గందరగోళం నెలకొంది. కేశంపేట మండలం లింగంధన గ్రామంలో 836మంది ఓటర్లు ఉండగా, ఓసీలు 189, బీసీలు 389, ఎస్సీలు 252, ఎస్టీలు ఆరుగురు ఉన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం లింగంధన గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ జారీచేసి రిజర్వేషన్లు ప్రకటించింది. ఇందులో సర్పంచ్‌తో పాటు 8 వార్డులకు రిజర్వేషన్ కల్పించారు. సర్పంచ్ పదవి ఎస్సీ జనరల్‌కు కేటాయించగా, 8 వార్డుల్లో.. 1వ వార్డు ఒక్కటే బీసీకి కేటాయించారు. 389 ఓటర్లు ఉంటే ఒక్క బీసీ స్థానం కేటాయించడం పట్ల బీసీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత పెద్దసంఖ్యలో బీసీలుంటే ఒక్క స్థానంతో సరిపెట్టారని, బీసీలకు అన్యాయం చేయడమేనన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన శంషాబాద్ మండలంలో చోటుచేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. బుధవారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సాయంత్రం డయల్ 100కు శంషాబాద్ మండలం సాతంరాయి వద్ద రోడ్డు ప్రమాదం జరిగినట్లు సమాచారం అందింది. దాంతో వారు అక్కడికి వెళ్లి చూడగా ఎవరూ లేకపోవడంతో డయల్ 100కు ఫోన్ చేసిన వ్యక్తి సుధీర్‌కు ఫోన్ చేశారు. అయితే, గుర్తుతెలియని వ్యక్తి సాతంరాయి వద్ద రోడ్డు దాటుతుండగా శంషాబాద్ వైపు నుంచి వేగంగా వస్తున్న టాటా ఏస్(టీజీ07 వీ5706) ఢీకొట్టిందని సుధీర్ పోలీసులకు తెలిపాడు. గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్థానికులు శంషాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు ఆ వ్యక్తి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



కాంగ్రెస్ నాయకులతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

విపక్షాల కుట్రలను ఎండగట్టాలి

ఆమనగల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే కాంగ్రెస్‌కు పంచాయతీ ఎన్నికల్లో విజయ సోపానమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఎన్నిక ఏదైనా కాంగ్రెస్‌దే విజయమని ఆయన అన్నారు. ఆమనగల్లు, వెల్దండ, కడ్తాల మండలాల్లో గురువారం ఎమ్మెల్యే పర్యటించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలపై పార్టీ శ్రేణులతో చర్చించారు. స్థానికంగా ఉండి ప్రజాభిమానం కలిగిన వారికే సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీకి అవకాశం కల్పించడం జరుగుతుందని, పార్టీ నిర్ణయించే అభ్యర్థుల విజయం కోసం శ్రేణులంతా కష్టపడి పని చేయాలన్నారు. రిజర్వేషన్ల మూలంగా పోటీకి అవకాశం రానివారికి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలతో పాటు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే గ్రామాలు అభివృద్ధి చెంది ప్రజలకు మౌలిక వసతులు ఒనగూడాయని నారాయణరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున పంచాయతీ ఎన్నికల్లో ఆ పార్టీ మద్దతు అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేపట్టడానికి వీలు కలుగుతుందన్నారు. పనిచేస్తున్న ప్రభుత్వానికి ప్రజలంతా బాసటగా నిలవాలని కోరారు. విపక్షాల విషప్రచారాలు, కుట్ర రాజకీయాలు నమ్మి మోసపోవద్దన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అద్భుత ప్రగతి సాధించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధికి సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పంచాయతీ ఎన్నికల్లో 90 శాతం స్థానాలు కాంగ్రెస్ మద్దతు అభ్యర్థులు కైవసం చేసుకుంటారని కసిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, యాట నర్సింహ, గూడూరు భాస్కర్‌రెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, హన్మానాయక్, భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వెంకటయ్య, రామకృష్ణ, విజయ్, అనంత రెడ్డి, నిట్ట నారాయణ, ప్రభాకర్‌రెడ్డి, బీక్యానాయక్, బిచ్యనాయక్, చేగూరి వెంకటేశ్, చందోజీ, శ్రీశైలం, కాసు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్ నిజాయితీ..

బస్సులో మర్చిపోయిన డబ్బు ప్రయాణికురాలికి అప్పగింత

శంకర్‌పల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ డిపోకు చెందిన బస్సు కండక్టర్ మీనా... ఓ ప్రయాణికురాలు బస్సులో మర్చిపోయిన డబ్బులను అందజేసి నిజాయితీ చాటుకున్నారు. గురువారం ఉదయం చేవెళ్ల నుంచి శంకర్‌పల్లికి వికారాబాద్ డిపోకు చెందిన బస్సులో కుమ్మెర స్టేజీ వద్ద సుజాత తన భర్తతో కలిసి ఎక్కి శంకర్‌పల్లిలో దిగింది. కూతురు పెళ్లి బట్టలు కొనడానికని తీసుకొచ్చిన డబ్బులు... బస్సు దిగే సమయంలో అందులోనే మర్చిపోయింది. కండక్టర్ బ్యాగును గమనించి అందులో రూ.2లక్షలు ఉన్నాయనే విషయాన్ని వికారాబాద్ కంట్రోలర్ సుదర్శన్‌కు సమాచారం ఇచ్చింది. డబ్బులు మరిచిపోయిన విషయాన్ని ప్రయాణికురాలు సుజాత శంకర్‌పల్లి ఆర్టీసీ అధికారులను సంప్రదించి వివరించింది. అయితే డబ్బులు కండక్టర్ వద్దనే ఉన్నాయని వారు తెలపడంతో సుజాత భర్తతో కలిసి కారులో చేవెళ్లకు వెళ్లింది. శంకర్‌పల్లికి వస్తున్న బస్సును చేవెళ్ల అయ్యప్పస్వామి దేవాలయం వద్ద నిలిపి కండక్టర్ మీనా, డ్రైవర్ శ్రీకాంత్‌లు వారికి రూ.2లక్షలను అందజేశారు. పోగొట్టుకున్న డబ్బును తిరిగి పొందడంతో సుజాత సంతోషం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా కండక్టర్, డ్రైవర్‌లను పలువురు అభినందించారు.

బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడిగా శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బీఎస్పీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడిగా గుండె శ్రీనివాస్, ఇన్‌చార్జిగా బంగారుగల్ల మహేందర్‌ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ గురువారం ప్రకటించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. మహనీయుల బాటలో నడుస్తూ బహుజనులను ఏకం చేస్తానని ఆయన తెలిపారు.

బాల్యమిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

యాచారం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన స్నేహితుడి కుటుంబానికి గురువారం 2003-04 టెన్త్ బ్యాచ్‌మేట్స్ ఆర్థిక సాయమందించారు. చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన గోలి వెంకటేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. పదోతరగతి మిత్రులు అతడి భార్య కృష్ణవేణికి రూ.56వేల ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా వారికి ఆమె ధన్యవాదాలు తెలిపారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

షాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంపీడీవో అపర్ణ, ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి అన్నారు. మైక్రోసాఫ్ట్ సహకారంతో యూనైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా షాబాద్ పీఆర్ఆర్ మినీస్టేడియంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్, వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన జట్లకు గురువారం బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ యువత చెటు అలవాట్లు నేర్చుకోకుండా సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వ చేయూతనిస్తుందని, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు మైక్రోసాఫ్ట్ ఎంతో కృషి చేస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శంకర్ రెడ్డి, మేనేజర్ రాములు, యూనైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ టీం సభ్యులు సతీష్, ప్రశాంత్, రమేష్, శ్రవణ్, శ్రీకాంత్, రిజ్వానా, ప్రవల్లిక, అనిల్, శ్రీపతి, అంజిలప్ప, క్రీడాకారులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లలో బీసీలకు అన్యాయం

ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్

మొయినాబాద్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు బీసీలకు తీరని అన్యాయం చేసిందని ఎంపీటీసీల ఫోరం మొయినాబాద్ మండల మాజీ అధ్యక్షుడు మోర శ్రీనివాస్ విమర్శించారు. మండల పరిధిలోని రెడ్డిపల్లిలో గురువారం ఆయన మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థల్లో, విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి.. బీసీల ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్ధానాలను విస్మరించిందన్నారు. నమ్మించి మోసం చేయడం పాలకులకు అలవాటుగా మారిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

పల్లెల్లో పట్టెవరిది?

(ఐదో పేజీ తరువాయి)

గెలుపొందే అవకాశాలు ఉంటాయనే విషయమై వారు పార్టీల ముఖ్యనేతలతో ఆరా తీస్తున్నారు.

అధికార పార్టీకి సవాల్

ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో సత్తా చాటేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. వాస్తవానికి పలుచోట్ల అధికార పార్టీకి అంతంత మాత్రమే పట్టు ఉంది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో పల్లెల్లో బీఆర్ఎస్ ఢీ అంటే ఢీ అనే విధంగా ఓట్లు సాధించింది. చేవెళ్ల, మహేశ్వరం, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, కల్వకుర్తిలో కాంగ్రెస్ విజయం సాధించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ ఇంకా పల్లెల్లో పూర్తి పట్టుసాధించలేదు. అధికారంలోకి వచ్చిన తరువాత పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నా వాటి ద్వారా ప్రజల మద్దతును కూడబెట్టుకోవడంలో అధికార పార్టీ విఫలమవుతోంది. ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత తొలిసారిగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రారంభించింది. ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, సబ్సిడీ వంట గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ చీరలు వంటి పథకాలను అమలు చేస్తోంది. అయితే వీటిని ప్రచారస్త్రాలుగా మార్చుకోవడంలో విఫలమవుతోంది. క్షేత్రస్థాయిలో ఆ పార్టీలో సమన్వయం లేక నేతల మధ్య వివాదాల కారణంగా కాంగ్రెస్ గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా పాగా వేయలేదు. అయితే, ఎన్నికల్లో తమ మద్దతుదారులను పెద్దసంఖ్యలో సర్పంచ్, వార్డుసభ్యులుగా గెలిపించుకోవడం ద్వారా పల్లెల్లో పట్టుసాధించాలని కాంగ్రెస్ భావిస్తోంది. తద్వారా పరిషత్ ఎన్నికల్లో ఏకపక్షంగా ఫలితాలు రాబట్టాలని యోచిస్తోంది. స్థానిక నాయకత్వానికి పార్టీ అధినాయకత్వం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రతి మండలంలో 95శాతానికిపైగా పంచాయతీ సర్పంచ్, వార్డు పదవులను కైవసం చేసుకోవాలని ఆదేశించింది.

విశ్వేశ్వర్‌రెడ్డికి చేవెళ్ల నాయకుల పరామర్శ



విశ్వేశ్వర్‌రెడ్డితో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని చేవెళ్ల బీజేపీ నాయకులు, పలువురు కార్యకర్తలు పరామర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో నాయకులు కలిసి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాగా, ఇటీవల విశ్వేశ్వర్ రెడ్డి ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్నారు. ఈమేరకు నాయకులు ఆయన్ను పరామర్శించారు. చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, చేవెళ్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు డాక్టర్ వైభవ్‌రెడ్డి, కృష్ణ శ్రీకాంత్‌రెడ్డి, జయశంకర్‌గౌడ్, కృష్ణ రెడ్డి, పాగా వెంకటేశ్, రఘు, భీమ్‌రెడ్డి, జయసింహరెడ్డి, పత్తి సత్యనారాయణ, చీర శ్రీనివాస్, అభిషేక్‌రెడ్డి, తదితరులు ఎంపీని పరామర్శించిన వారిలో ఉన్నారు.

'భగవద్గీత' పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులతో నిర్వాహకులు

కేశంపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తొమ్మిదిరేకుల శ్రీ కిషన్ ప్రభు ధర్మప్రచార సమితి ఆధ్వర్యంలో గురువారం కేశంపేట మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు భగవద్గీత శ్లోక కంఠస్థ పఠన పోటీలు నిర్వహించారు. కాకునూర్ ప్రభుత్వ పాఠశాల, కేశంపేట ఆదర్శ విద్యాలయం, గ్లోబల్ పాఠశాలలకు చెందిన 64 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. ఉన్నత పాఠశాల విభాగంలో ఆదర్శ విద్యాలయానికి చెందిన అక్షిత ప్రథమ బహుమతి, గ్లోబల్ పాఠశాల విద్యార్థిని సోని ద్వితీయ బహుమతి, ఆదర్శ విద్యాలయానికి చెందిన రష్మి తృతీయ బహుమతి అందుకున్నారు. అలాగే ప్రాథమిక పాఠశాల విభాగంలో గ్లోబల్ పాఠశాలకు చెందిన రిషిత ప్రథమ బహుమతి, ఆదర్శ పాఠశాలకు చెందిన సూర్యపటేల్ ద్వితీయ, గ్లోబల్ పాఠశాలకు చెందిన శ్రీనిఖ తృతీయ బహుమతి, ఆదర్శ విద్యాలయానికి చెందిన శీనిత్య ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు. కార్యక్రమంలో శ్రీ కిషన్ ప్రభు ధర్మప్రచార సమితి వ్యవస్థాపకులు డాక్టర్ ఉమ్మెంతల మహేశ్వర్‌రెడ్డి, సమితి సభ్యులు హరికిషన్‌రెడ్డి, అయ్యపురెడ్డి, రంగయ్య, చంద్రశేఖర్ గుప్తా, శంకర్‌జీ ఆదర్శ పాఠశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి, గ్లోబల్ పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

మాడ్గుల : జెడ్పీహెచ్‌ఎస్‌లో మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఎల్టా సంస్థ స్పీచ్, రిటర్న్ టెస్టులు నిర్వహించింది. జడ్పీహెచ్ఎస్ విద్యార్థి అపూర్వ మొదటి బహుమతి, ఆర్కపల్లి స్కూల్ విద్యార్థి అంజనేయులు ద్వితీయ బహుమతి పొందారు. ఈమేరకు వారికి బహుమతులు అందించారు.

'కాంగ్రెస్' అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించి పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు ఏఎంసీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్‌లు పిలుపునిచ్చారు. పార్టీ నిర్ణయించే అభ్యర్థి విజయం కోసం కలిసి కట్టుగా ముందుకు సాగాలని సూచించారు. కడ్తాల మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో గురువారం పంచాయతీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, అభ్యర్థి ఎంపికకు సంబంధించి కార్యకర్తల అభిప్రాయ సేకరణకు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యకర్తలు సర్పంచ్ అభ్యర్థి ఎంపికపై తమ అభిప్రాయాలను సమావేశంలో తెలిపారు. ఆరుగురు సర్పంచ్ పదవిని ఆశించగా నలుగురుకి నచ్చజెప్పడంతో గురిగల్ల లక్ష్మయ్య, భిక్షపతిల మధ్య ప్రస్తుతం పోటీ నెలకొంది. అందరి ఏకాభిప్రాయం మేరకు సర్పంచ్ అభ్యర్థి ఎంపిక జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు చేగూరి వెంకటేశ్, గురిగల్ల లక్ష్మయ్య, జహంగీర్‌బాబా, వేణుగోపాల్, జహంగీర్‌అలీ, యాదయ్యగౌడ్, చందోజీ, భిక్షపతి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

(ఐదో పేజీ తరువాయి)

అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి తెలిపారు. రైతులకు న్యాయమైన పరిహారం అందేలా చూస్తామని ఆయన పేర్కొన్నారు. కడ్తాల మండలం ఎక్వాయిపల్లి గ్రామంలో గురువారం గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణానికి భూములు కోల్పోతున్న రైతులతో రెవెన్యూ అధికారులు గ్రామ సభ నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశానికి ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజుల తో కలిసి అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. భూములు కోల్పోయే రైతులకు రూ. 30 లక్షలు అందించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని తెలిపారు. లేదంటే రూ.25 లక్షలు, ఒక ప్లాటు ఇవ్వడం జరుగుతుందన్నారు. దీంతో ఎకరాకు రూ. కోటి పరిహారం ఇస్తేనే భూమిలిస్తామని రైతులు తేల్చి చెప్పి గ్రామసభ నుంచి వెళ్లి పోయారు. తహసీల్దార్ జయశ్రీ, సీఐ గంగాధర్, నాయకులు రవికాంత్‌గౌడ్, వీరయ్య, కరుణాకర్ గౌడ్, జంగయ్య, శ్రీను, హరీశ్, వెంకటేశ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా అయ్యప్ప మహా పడిపూజ



కందుకూరు : పూజలో అయ్యప్ప భక్తులు



శంషాబాద్ : పడిపూజలో అయ్యప్ప భక్తులు

కందుకూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగూడ గ్రామానికి చెందిన సాధ నాగేశ్వర్‌రెడ్డి గురుస్వామి గురువారం గ్రామంలో ఏర్పాటు చేసిన 18వ మెట్టు అయ్యప్ప మహాపడి పూజ అట్టహాసంగా నిర్వహించారు. మండలంలోని 25గ్రామ పంచాయతీల్లో అయ్యప్ప మాలధారణ భక్తులతో పాటు ఇబ్రహీంపట్నం, బాలాపూర్, కడ్తాల్, మహేశ్వరం, యాచారం మండలాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వామి కుట్టన్ చంద్ర మోహన్‌నాయర్ అమృత హస్తాలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. శబరీశ్వర భజన బృందం ప్రతినిధి జంగిరెడ్డి స్వామి పాటలు భక్తులను మంత్ర ముగ్ధులను చేశాయి. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో పాటు పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నాయకులు ఎస్.సురేందర్‌రెడ్డి, ఎల్మటి దేవేందర్‌రెడ్డి, లక్ష్మణ్‌ముదిరాజ్, జయేందర్‌ముదిరాజ్, గ్రామానికి చెందిన గురుస్వాములు సాధ మల్లారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, శేఖర్‌గౌడ్, సాయిశంకర్‌లతో పాటు 3 వేలకు పైగా భక్తులు పాల్గొన్నారు.

శంషాబాద్ : శంషాబాద్‌లోని మధురానగర్ బస్తీలో గురువారం శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి మహా పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మధురానగర్‌కు చెందిన ఆదిత్య స్వామి పూజ నిర్వహించగా దివంగత బాబు గురుస్వామి కుమారుడు మహేష్ గురుస్వామి అయ్యప్పస్వామి అష్టోత్తర పూజ నిర్వహించారు. స్థానిక అయ్యప్ప భజన మండలి సభ్యుల.. స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణతో బస్తీ మార్మోగింది. అయ్యప్ప స్వాముల భజన గీతాలతో బస్తీవాసులు హోరెత్తిపోయారు. కార్యక్రమంలో స్థానిక స్వాములు తదితరులు పాల్గొన్నారు.

'నూతన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి'

మొయినాబాద్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసేందుకు కుట్రపూరితంగా భారత పారిశ్రామిక రంగాన్ని దేశ, విదేశీ పెట్టుబడుదారులకు అప్పనంగా కట్టబెట్టేందుకు నాలుగు లేబర్ కోడ్‌లను రూపొందించిందని, వాటని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ మొయినాబాద్ మండల కన్వీనర్ ప్రవీన్‌కుమార్ అన్నారు. గురువారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం 29 కార్మిక చట్టాలను తొలగించి 4 చట్ట స్వభావం లేని కోడ్‌లుగా మార్చడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. కొత్త చట్టాలను రద్దుచేసి పాత వాటిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. గతంలో నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కార్మిక సంఘాలు ధర్నాలు, ఆందోళనలు, సమ్మెలు చేసినా నరేంద్రమోదీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఎట్టి పరిస్థితుల్లో నాలుగు కోడ్‌లను అనుమతించే ప్రసక్తే లేదన్నారు.